క్లుప్తంగా

చలో హైదరాబాద్ విజయవంతం చేయాలి

మేదరమెట్ల: హైదరాబాద్‌లో ఫిబ్రవరి 7వ తేదీన నిర్వహించనున్న లక్షల డప్పులు.. వేయి గొంతులు అనే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మున్నంగి నాగరాజు ఒక ప్రకటనలో తెలిపారు. అద్దంకి నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లుగా తేళ్ళ శ్రీనివాసరావు, పూనూరి రమేష్‌లను నియమించినట్లు తెలిపారు. తమకు పదవులు రావడానికి తోడ్పడిన ఎమ్మార్పీఎస్ నాయకులకు ధన్యవాదాలు తెలిపారు.

చెరువులో దిగి ఎడ్లు మృతి

బల్లికురవ: నీరు తాగేందుకు చెరువులోకి దిగి.. బురదలో కూరుకుని బయటకు రాలేక కాడెడ్లు చనిపోయాయి. ఈఘటన సోమవారం రాత్రి బల్లికురవ మండలంలోని గొర్రెపాడు చెరువులో జరగ్గా మంగళవారం వెలుగు చూసింది. గ్రామానికి చెందిన మక్కెన చెన్నయ్య ఎడ్లు మేపుకుంటూ వ్యవసాయం చేసుకుంటున్నాడు. ఇటీవలే రూ.1.10 లక్షలతో కాడెడ్లు కొనుగోలు చేశాడు. పొలం నుంచి కాడిమానుతో ఇంటికి వస్తుండగా నీటి కోసం చెరువులోకి దిగి చనిపోయాయి. పడవలు, పొక్‌లైయిన్ సహాయంతో ఎడ్ల కళేబరాలను బయటకు తీసి మంగళవారం అంత్రక్రియలు ముగించారు. ఎడ్లతోనే జీవనాన్ని వెళ్లదీస్తున్న తమ కుటుంబాన్ని ప్రభుత్వం సాయం అందించాలని కోరారు.

బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలు

అద్దంకి రూరల్: బైక్ అదుపుతప్పి యువకుడికి గాయాలైన సంఘటన మంగళవారం రాత్రి అద్దంకి పట్టణంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. బల్లికురవ మండలం కొత్తూరు గ్రామానికి చెందిన కె. నవీన్ మంగళవారం బైక్‌పై అద్దంకి వచ్చి ఎరువులు, పనిముట్లు తీసుకుని గ్రామానికి బయలుదేరాడు. పట్టణంలోని నామ్ హైవే పై నున్న వీఎస్ఎస్ సినిమాహాలు వద్దకు రాగానే ఫిట్స్ వచ్చి బైక్‌పై నుంచి కిందపడ్డాడు. స్థానికులు గమనించి ప్రయివేటు వైద్యశాలకు తరలించారు.

బీసీ కార్పొరేషన్ లోన్లకు దరఖాస్తుల ఆహ్వానం

మార్టూరు: ప్రభుత్వం మంజూరు చేయనున్న బీసీ కార్పొరేషన్ లోన్ల కోసం జనవరి 30వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ లోపు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వై. శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు బ్యాంకు అధికారులతో కలిసి ఇంటర్వ్యూ నిర్వహించనున్నట్లు తెలిపారు.

కల్లుగీత కార్మికులకు 10 శాతం రిజర్వేషన్



పర్చూరు ఎక్సైజ్ సీఐ భుజంగరావు

పర్చూరు(చినగంజాం): రాష్ట్ర ప్రభుత్వం కల్లుగీత కులాల వారికి మద్యం షాపుల కేటాయింపులో 10 శాతం రిజర్వేషన్ కలిపించి టెండర్లకు పిలిచినట్లు పర్చూరు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ భుజంగరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంకొల్లు మండలంలో గౌడ ఉప కులస్తులకు ఒక షాపు కేటాయించినట్లు తెలిపారు. ఈ షాపునకు టెండర్ వేసేందుకు బాపట్ల జిల్లాకు చెందిన గౌడ కులస్తులు అర్హులని పేర్కొన్నారు. ఆసక్తి కలిగిన వారు 2025 ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. నాన్ రిఫండబుల్ ఫీజు రూ. 2 లక్షలు చెల్లించాలన్నారు. 2024–25 సంవత్సరానికి లైసెన్స్ ఫీజు రూ. 18,33,334, 2025–26 సంవత్సరానికి రూ30,25,000గా నిర్ణయించారని వివరించారు. 2025 ఫిబ్రవరి 7వ తేదీ బాపట్ల జిల్లా కలక్టరేట్ ఆవరణలోని పీజీఆర్ హాలులో డ్రా తీస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9440902496 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

శింగరకొండ దర్శిని



అద్దంకి: క్రోధి నామ సంవత్సరం. ఉత్తరాయణం మాఘ మాసం ఉత్తరాషాఢ నక్షత్రం ప్యాడమి తిథి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు చేస్తారని దేవస్థాన ఏసీ తిమ్మనాయుడు మంగళవారం తెలిపారు. బిందె తీర్థం, మధ్యాహ్నం 1.00 గంట నుంచి 1.30 గంట వరకు పంచ హారతుల పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి 7.45 గంటల వరకు జరిగే ప్రదోషకాలార్చన అనంతరం ఆలయం మూసివేస్తారు.

మంచానికి పరిమితమైన పెన్షనర్ల పరిశీలన

మద్దిపాడు: మండలంలో మంచానికి పరిమితమై మెడికల్ గ్రౌండ్స్ లో పెన్షన్ తీసుకుంటున్న 23 మందిని డాక్టర్లు మంగళవారం ప్రతి ఇంటికి వెళ్లి పరిశీలించారు. డాక్టర్ హర్ష, డాక్టర్ విజయ్ చంద్ర, పీహెచ్‌సీ డాక్టర్ ఆనంద మోహన్ లు మండలంలోని ఇనమనమెళ్లూరు గ్రామంలో ఐదుగురిని, బసవన్నపాలెంలో ఒకరు, పెద్దకొత్తపల్లి, నేలటూరుల్లో ఐదుగురు, దొడ్డవరంలో ఇద్దరు, మల్లవరంలో ఒకరు, కొలచనకోటలో ముగ్గురు,వీరిని పరిశీలించి నివేదికను కలెక్టర్‌కు అందజేయనున్నట్లు డాక్టర్లు తెలిపారు. కార్యక్రమంలో వారి వెంట ఎంపీడీవో వీ జ్యోతి, పీహెచ్‌సీ సూపర్‌వైజర్ బాలకోటయ్య, ఆయా గ్రామాల ఏఎన్ఎంలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

నాటు వికటిస్తే పాట్లే!



చెట్ల ఆకులు, చెట్ల వేర్లు, కొమ్మలను రోడ్డుపై ఉంచిన నాటు వైద్యుడు



వెన్నునొప్పి తగ్గిస్తానంటూ వ్యక్తికి తైలం రాసి పొగలు తెప్పిస్తున్న బురిడీ నాటు వైద్యుడు

- మాయ మాటలతో డబ్బులు దండుకుంటున్న బురిడీ నాటు వైద్యులు
- ప్రజల అమాయకత్వమే వారి సొమ్ము
- ఆకులు, అలమలు, చెట్ల వేర్లు, కొమ్మలతో వైద్యమంటూ మోసం

చీరాల రూరల్: శాస్త్ర, సాంకేతిక, వైద్య రంగాలు అత్యంత వేగంగా విస్తరిస్తున్న నేటి రోజుల్లో కూడా ప్రజల అమాయకత్వంతో కొందరు ఆటలాడుకుంటున్నారు. బురిడీ నాటు వైద్యులు చెప్పే మాయమాటలు నమ్మి వారు ఇస్తున్న ఆకు పసర్లు, జల్లీలు, తైలాలు వంటివికొని జేబులు గుల్ల చేసుకుంటున్నారు. ఒకవేళ వాటివల్ల ఆరోగ్యం దెబ్బతిన్నా ఏమీ చేయలేని దుస్థితి నెలకొంది. లక్షలకు లక్షలు ఖర్చుచేసి చదివే వైద్యులు కూడా నయం చేయలేని రోగాలను తాము నయం చేస్తామంటూ నమ్మబలుకుతూ ప్రజల ఆరోగ్యంతో చెలగాటం ఆడుతున్నారు. గతంలో సినిమా హాళ్ల సమీపంలో.. కూడళ్లలో కోయ దొరలం అంటూ ఈ తరహా మూలికలు అమ్మేవారు. అయితే ప్రస్తుతం బురిడీ నాటు వైద్యులు టెక్నాలజీని అందిపుచ్చుకుని దర్జాగా జనాల్ని మోసం చేస్తున్నారు. గత మూడు రోజులుగా చీరాల ప్రాంతంలో దందా సాగుతోంది. కేరళకు చెందినవారమంటూ ఓ ఏజెంట్ చిన్న మారుతి వ్యాన్‌ను ఏర్పాటు చేసుకుని అందులో టీవీ స్క్రీన్‌లో పాత క్యాసెట్లు ఏర్పాటు చేసి రోగులకు తాము నయం చేశామంటూ కొన్ని వీడియోలు చూపిస్తున్నాడు. ఇలా జనాలను నమ్మించి ఆకుపసర్లు, తైలాలు, జల్లీలను జనాలతో కొనుగోలు చేయించి దండుకున్నాడు. వారికి సంబంధించిన వ్యక్తిని పిలిచి ఇతనికి నడుం నొప్పిగా ఉందంటూ తనవద్దనున్న తైలాన్ని అతని నడుము వద్ద మర్దనా చేస్తున్నారు. మర్దన చేస్తుండగా పొగలు రావడం నడుము నొప్పి తగ్గిపోయిందని అతడు చెప్పడం.. చూసే జనాలు నమ్మడం అంతా చకచకా అయిపోతోంది. ఇలా అతగాడు చెప్పే మాయమాటలను జనాలు నమ్మి మందులను కొనుగోలుచేసి జేబులు గుల్ల చేసుకున్నారు. నడుము నొప్పికి, మోకాళ్ల నొప్పులకు, జాయింట్ నొప్పులకు, అరచేయి.. అరకాళ్ల మంటలకు, ఎముకలు విరిగిన నొప్పులకు, షుగర్, బీపీ, కాళ్లు చచ్చుబడినా, పక్షవాతం వచ్చినా కాళ్లు.. చేతుల్లో నీరు ఉన్నా మందులు ఇస్తామంటున్నారు. ఒక్కో బాటిల్‌ను 300 నుంచి రూ. 1500కు.. గ్యాస్ట్రబుల్ చూర్ణం రూ. 500 వంతను అమ్ముతున్నారు. ఇంత జరుగుతున్నా ఏ ఒక్క అధికారి కానీ.. పోలీసులు కానీ వారిని ప్రశ్నించకపోవడం గమనార్హం. చేతులు కాలాక ఆకులు పట్టుకున్న చందంగా ఏదైనా జరిగిన తరువాత సీసీ కెమెరాలు చూసి హడావుడి చేసేకంటే ముందుగానే ఇటువంటివి గుర్తించి ప్రజలను అప్రమత్తం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

దోమకాటు వ్యాధులను పారదోలాలి



దోమల నివారణ మందు చల్లిస్తున్న జిల్లా మలేరియా అధికారి గోపీనాథ్

కారంచేడు: దోమల ద్వారా వ్యాపించే వ్యాధులకు భవిష్యత్తులో చెక్ పెట్టే విధంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని బాపట్ల మలేరియా అధికారి డాక్టర్ బి. గోపీనాథ్ అన్నారు. మంగళవారం స్వర్ణ, కారంచేడు పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయా పీహెచ్‌సీలకు సంబంధించిన అన్ని రకాల రికార్డులను ఆయన క్షుణ్ణంగా పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. పీహెచ్‌సీల పరిధిలో ఇప్పటి వరకు ఎక్కడైనా డెంగీ, టైఫాయిడ్, మలేరియా, జ్వరాలు నమోదులపై రివ్యూ నిర్వహించారు. గ్రామాల్లో మురుగునీరు నిల్వలుండకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఫీల్డులో ఏఎన్ఎంలు తప్పకుండా రక్తపూతలు సేకరించాలన్నారు. డాక్టర్ హస్మప్రియ, డాక్టర్ జెస్సీ రాణి, హెచ్ఎస్ శ్రీనివాసరావు, రవికుమార్, హెచ్ఈ మీనాకుమారి, హెచ్‌వీ మాధురీసిఫోరా, ఎల్‌టీలు బయ్యా శంకర్, సుబ్బారావు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

పర్చూరు(చినగంజాం): కీటక జనిత వ్యాధులు సోకకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి డాక్టర్ గోపీనాథ్ సూచించారు.



స్వర్ణ పీహెచ్‌సీలో రికార్డులు పరిశీలిస్తున్న బాపట్ల డీఎంఓ డాక్టర్ గోపీనాథ్

పర్చూరు గ్రాంలో మంగళవారం నీటి కాలువలను, గృహాలను పరిశీలించారు. దోమ లార్వా ఉండటం గుర్తించి ఇంటి యజమానులకు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆరోగ్య సిబ్బంది ద్వారా లార్వాలు నిలువు ఉన్న ప్రాంతాల్లో నివారణ మందులను చల్లించారు. అనంతరం ఎంపీడీఓ వి. ప్రద్యుమ్నకుమార్‌ను కలిసి మురుగు నీటి కాలువలలో దోమ లార్వాను ఎక్కువగా ఉన్నట్లు గుర్తించామని.. తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. చీరాల ఎస్ఈఓ రవికుమార్, పర్చూరు వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కార్యకర్తల సమైక్యతే పార్టీకి అండ



సమీక్ష సమావేశంలో పాల్గొన్న యద్దనపూడి నాయకులు, కార్యకర్తలు



ఇన్‌చార్జ్‌తో మాట్లాడుతున్న మార్టూరు నాయకులు

- పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయకర్త గాదె మధుసూదన రెడ్డి

పర్చూరు(చినగంజాం): కార్యకర్తల సమైక్య కృషి, అంకిత భావం పార్టీకి బలమైన అండ అని పర్చూరు నియోజక వర్గ వైఎస్సార్ సీపీ సమన్వయ కర్త గాదె మధుసూదన రెడ్డి అన్నారు. మంగళవారం గుంటూరులోని ఆయన నివాస గృహంలో నియోజకవర్గంలోని యద్దనపూడి, మార్టూరు మండలాల నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడారు. పర్చూరు నియోజకవర్గంలో బలమైన పార్టీగా అవతరించాలని, వైఎస్సార్ సీపీ ప్రభుత్వ ప్రవేశ పెట్టిన ప్రజా సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకొనివెళ్లి, ప్రస్తుత ప్రభుత్వం చేస్తున్న మోసపూరిత హామీలు, ప్రజా వ్యతిరేక విధానాలను వారికి తెలియజేయాలన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ రాబోయే ఎన్నికల సమయానికి బలమైన శక్తిగా ఎదుగుతుందని అందుకు కార్యకర్తలే ముఖ్యకారకులన్నారు. పర్చూరు నియోజక వర్గంలో నాయకులు, కార్యకర్తలు పార్టీని బలోపేతం చేసేందుకు కృషి చేయాలని.. అందుకు పార్టీ అధినేత అండగా ఉంటారని, నియోజకవర్గ పరిధిలో తాను సహకరిస్తానన్నారు. కార్యక్రమంలో యద్దనపూడి మండలానికి చెందిన 50 మంది నాయకులు పాల్గొనగా వారిలో రావూరి వేణుబాబు, మువ్వల రాంబాబు, తమ్మా అమ్మిరెడ్డి, పాలెపోగు రాంబాబు, తేళ్ళ చుక్కయ్య, తనుబొద్ది వీరారెడ్డి, నక్కా పోతురెడ్డి, గనిపిశెట్టి వాసుబాబు, గనిపిశెట్టి వెంకటరావు, సవరపు వందనం, తూబాటి బాలకృష్ణ, తమ్మలూరి కోటయ్య, దొడ్ల రవి, జంపని కోటేశ్వరరావు తదితరులున్నారు. మార్టూరు మండలం నుంచి 70 మంది హాజరు కాగా.. వారిలో పటాన్ కాలేషావలి, బాబు నాయక్, జి. సుందరరావు, జి. రవీచందర్, పెంటాల సత్యనారాయణ, జంపాని వీరయ్య చౌదరి, ఉప్పలపాటి అనిల్, శ్రీనివాసరెడ్డి, నాగిరెడ్డి తదితరులున్నారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న న్యాయవాది

అద్దంకి: పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యతని రోటరీ క్లబ్ ఆఫ్ శింగరకొండ అధ్యక్షుడు చప్పిడి వీరయ్య అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ, రోటరీ క్లబ్ ఆఫ్ శిగరకొండ సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో జలవనరుల సంరక్షణ, లింగ నిర్ధారణ పరీక్షలు, వినియోగదరాఉల హక్కుల పరిరక్షణ, అనే అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. రోటరీ సెక్రటరీ చండుఊరి మురళీ సుధాకర రావు, ట్రెజరర్ మలాది శ్రీనిసరావు, న్యాయవాదులు ఎం. ప్రకాశ్, మార్త శ్రీనివాసరావు, షేక్ మహ్మద్ రఫీ, రోటరీ సభ్యులు పాల్గొన్నారు.

కుంకుమ తెగులుతో అప్రమత్తంగా ఉండాలి



అద్దంకి: రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారి

అద్దంకి రూరల్: శనగలో కుంకుమ తెగులు పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని అద్దంకి సహాయ వ్యవసాయ సంచాలకులు కె. ధన్‌రాజ్ అన్నారు. మంగళవారం మండలంలోని మణికేశ్వరం, కొంగపాడు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. దీనిలో భాగంగా సహాయ వ్యవసాయ సంచాలకులు మాట్లాడుతూ శనగలో కుంకుమ తెగులు నివారణకు హెక్సాకోనాజోల్ 400 ఎంఎల్ ఎకరాకు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వ్యవసాయాధికారి కె. వెంకటకృష్ణ మాట్లాడుతూ ఇ– పంట నమోదు నమోదు చేసుకోవాలని సూచించారు. ఉద్యాన అధికారి ఎస్‌దీప్తి, గ్రామ వ్యవసాయ సహాయకులు రాని, గుడిపూడి బ్రహ్మయ్య, నర్రా బ్రహ్మనందం తదితరులు పాల్గొన్నారు.



మేదరమెట్లలో కార్యక్రమం నిర్వహిస్తున్న ఏవో శ్రీనివాసరావు, రైతులు

మేదరమెట్ల: పొలం పిలుస్తోంది కార్యక్రమం రాచపూడి, మేదరమెట్ల గ్రామాల్లో మంగళవారం ఏవో శ్రీనివాసరావు నిర్వహించారు. రైతులకు వ్యవసాయ పద్ధతులపై సూచనలు ,సలహాలను అందచేశారు. పంట నమోదు చేయించుకోవాలని సూచించారు. ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

అంకితభావంతో పనిచేస్తే గుర్తింపు



ఉత్తమ అవార్డులు అందుకున్న తహసీల్దార్ గోపీకృష్ణను సత్కరిస్తున్న రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది

చీరాల టౌన్: వృత్తిపట్ల నిబద్ధత, అంకితభావంతో పనిచేస్తే గుర్తింపుతో పాటు ఉత్తమ సేవా అవార్డులు అందుకుంటారని డిప్యూటీ తహసీల్దార్ దేవతోటి అర్జున్ అన్నారు. చీరాల తహసీల్దార్ కుర్రా గోపీకృష్ణ 15వ జాతీయ ఓటరు దినోత్సవంలో ఉత్తమ సహాయ ఎన్నికల అధికారిగా, 76వ గణతంత్ర దినోత్సవంలో ఉత్తమ తహసీల్దార్‌గా రెండు అవార్డులు, ప్రశంశలు అందుకున్నారు. దీంతో మంగళవారం కార్యాలయంలో రెవెన్యూ ఉద్యోగులు, సిబ్బంది ఘన సన్మానం చేశారు. డిప్యూటీ తహసీల్దార్ అర్జున్ ఆధ్వర్యంలో వీఆర్వోలు, కార్యాలయ ఉద్యోగులు.. గోపీకృష్ణను శాలువాలు, పూల మాలలతో ఘనంగా సత్కరించారు. రానున్న కాలంలో ప్రజా సమస్యలను మరింతగా పరిష్కరించి ప్రజలందరికీ న్యాయం చేస్తానని తహసీల్దార్ గోపీకృష్ణ తెలిపారు. ఎన్నికల డీటీ సుశీల, సీనియర్ అసిస్టెంట్ కవిత, వీఆర్వోలు కృష్ణారెడ్డి, శేఖర్, కళ్యాణ్, సిబ్బంది ఉన్నారు.

తహసీల్దార్‌కు సత్కారం

చినగంజాం: ఉత్తమ తహసీల్దార్‌గా గణతంత్ర వేడుకల్లో కలెక్టర్ జె. వెంకట మురళి చేతుల మీదుగా అవార్డు అందుకున్న తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావును సోపిరాల గ్రామానికి చెందిన పలువురు నాయకులు మంగళవారం సన్మానించారు. తహసీల్దార్ కార్యాలయంలో ఆయనను కలిసిన శాలువా కప్పి, స్వీట్లు అందజేశారు. ఆయనను సన్మానించిన వారిలో చింతగుంపల సొసైటీ మాజీ ప్రెసిడెంట్ తుమ్మలపెంట జయరావు, చీరాల మార్కెటింగ్ మాజీ డైరెక్టర్ పల్లపోలు లక్ష్మీనారాయణ, ధర్మవరపు ఏసునారాయణ, గంటా నరసింహారావు ఆయనను కలిసిన వారిలో ఉన్నారు. ఇటువంటి అవార్డులు మరెన్నో అందుకోవాలంటూ అభినందనలు తెలియజేశారు.



తహసీల్దార్‌ను సన్మానిస్తున్న సోపిరాల గ్రామ నాయకులు

కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని అమ్ముకోండి



రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయాధికారి భాస్కరరావు

చినగంజాం: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యాన్ని అమ్ముకోవాలని మండల వ్యవసాయాధికారి కె. భాస్కరరావు సూచించారు. మంగళవారం సంతరావూరు, చింతగుంపలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. రైతు సేవాకేంద్రాలను సందర్శించి మద్దతు ధర పొందవచ్చని తెలిపారు. రైతు సేవాకేంద్రం సిబ్బంది నీలిమ, సంధ్య, రైతులు పాల్గొన్నారు.

అక్రమ మద్యం నిల్వలపై నిఘా



కారంచేడులో తనిఖీ చేస్తున్న ఎస్ఐ వెంకట్రావు

కారంచేడు: అక్రమంగా మద్యంను నిల్వలు ఉంచి, అమ్మకాలు చేస్తే సహించేది లేదని, నిరంతర నిఘా ఉంచుతున్నామని కారంచేడు ఎస్ఐ వి. వెంకట్రావు అన్నారు. మంగళవారం కారంచేడు కాలువ సెంటర్, సాయినగర్, మద్య బస్టాండ్ సమీప ప్రాంతాల్లో నిర్వహిస్తున్న దాబాలు, రెస్టారెంట్‌లలో తనిఖీలు చేశారు.

రోడ్డు భద్రతా నియమాలు తప్పనిసరి



మాట్లాడుతున్న జిల్లా రవాణా శాఖాధికారి పరంధామ రెడ్డి

చీరాల: వాహనం నడిపే సమయంలో భద్రతా నియమాలు పాటించకపోవడం వలనే ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా రవాణా శాఖాధికారి టి.కె.పరంధామరెడ్డి అన్నారు. 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల్లో భాగంగా మంగళవారం స్థానిక వైఏ ప్రభుత్వ మహిళా డిగ్రీ కాలేజీలో విద్యార్థినులకు అవగాహన సదస్సును నిర్వహించారు. యువత ఎక్కువగా యాక్సిడెంట్లకు గురవుతున్నారన్నారు. చీరాల ఎంవీఐ బి.రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ టూవీలర్ నడిపే వారు హెల్మెట్, కారు నడిపేవారు సీట్ బెల్ట్‌ను తప్పనిసరిగా ధరించాలన్నారు. సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమన్నారు. ఎన్‌జీఓ రాజా సాల్మన్ వీడియో ద్వారా ప్రమాదాలు జరగడానికి గల పలు కారణాలను వివరించారు. వైస్ ప్రిన్సిపాల్ జీపీ నీలాకుమారి, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

దేవాలయాలను

పరిరక్షించుకోవాలి



భక్తులకు అనుగ్రహభాషణం చేస్తున్న గణపతి సచ్చిదానంద స్వామిజీ

అద్దంకిరూరల్: దేవాలయాలను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత హిందువులందరిపై ఉందని గణపతి సచ్చిదానంద స్వామి అన్నారు. మంగళవారం స్థానిక ధన్వంతరీ దత్తపాదుకా క్షేత్రంలో జరిగిన కార్యక్రమంలో భక్తులకు అనుగ్రహభాషణం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సనాతన ధర్మాని పాటించి దాన ధర్మాలు చేయాలన్నారు. మానవునిసేవే మాధవ సేవగా గుర్తించి సమాజ సేవకు పాటు పడాలన్నారు. అనంతరం పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. దత్త విజయానంద తీర్థ స్వామిజీ, దేవస్థాన కమిటీ, భక్తులు పాల్గొన్నారు.